క్లుప్తంగా

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: టీబీ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు ఇవ్వడం, పోషణ భత్యం కింద రూ.వెయ్యి ఇస్తుందని, ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అవినాష్, పంచాయతీ సెక్రటరీ సుజాత, పీహెచ్‌సీ, క్షయ వ్యాధి సిబ్బంది, ఐకేపీ కోఆర్డినేటర్ భీష్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం సారధినగర్‌లో కొనసాగుతున్న వ్యభిచారగృహంపై మంగళవారం త్రీటౌన్ పోలీసులు దాడి చేశారు. ఈసందర్భంగా నిర్వాహకురాలితో పాటు ఓ విటుడు, మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఖమ్మం లీగల్: కూకట్పల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై జరిగిన దాడికి నిరసనగా ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు ఒకరోజు విధులను బహిష్కరించారు. తరచుగా న్యాయవాదులపై దాడులు జరగడాన్ని ఖమ్మం భార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదిపై భౌతిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఎంపీజే బృందం శుభాకాంక్షలు

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మొహమ్మద్ ముజాహిద్‌ను ఎంపీజే బృందం మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం మాట్లాడగా.. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఏ.గఫార్, కోశాధికారి ఎండీ. హకీమ్, కార్యదర్శి సయ్యద్ రఫీ, సభ్యులు ఎండీ పాషా తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తున్న నేపథ్యాన రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల చిత్రపటాలకు ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యాన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం వల్ల విద్యాప్రమాణాలు సాధించుటకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె.మన్సూర్, నాయకులు పి.వెంకన్న, టి.సుధాకర్, డీ.ఆర్.కే.రాజు, వై.నాగేశ్వరరావు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


నాగరాజును అభినందిస్తున్న ఆర్‌సీఓ, ఉపాధ్యాయులు

కూసుమంచి: కూసుమంచిలోని ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థి ఏ.నాగరాజు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ పేరబోయిన మల్లయ్య తెలిపారు. ఈనెల 21న ఖమ్మంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆయనను మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా నాగరాజును గురుకులాల ఆర్‌సీఓ రాంబాబు, ప్రిన్సిపాల్ మల్లయ్య, ఏటీపీ వెంకటేశ్వర్లు, వార్డెన్ వెంకటనర్సయ్య, పీడీ వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	మహావతార్, నర్సింహా
సాయిరాం	మేఘాలు చెప్పిన ప్రేమ కథ, పరదా
ఆదిత్య	స్టాలిన్
శ్రీనివాస	వార్- 2

- ఖమ్మంగాంధీచౌక్


పూల కొనుగోళ్లతో నెలకొన్న రద్దీ


ఖమ్మంగాంధీచౌక్: బ్రాహ్మణబజార్ శివాలయం సెంటర్‌లో 36 అడుగుల విశ్వరూప్ త్రిశూంద్ మట్టి గణపతి


పెవిలియన్ గ్రౌండ్ వద్ద వినాయక ప్రతిమల కొనుగోళ్లు

వచ్చాడయ్యో స్వామి..

అన్ని పండగలతో పోలిస్తే వినాయక చవితి పండుగకు ఒక ప్రత్యేకత స్థానం ఉంటుంది. కులమతాలకు అతీతంగా తొమ్మిదిరోజుల పాటు నవరాత్రోత్సవాలను జరుపుకోనుండగా.. బుధవారం నుంచి వేడుకలు నిర్వహించుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఇందుకు కూడళ్లు, మండపాలు, ఖాళీ స్థలాల్లో వేదికలు ఏర్పాటు చేసుకుని వినాయక విగ్రహాలను చేర్చారు. భక్తుల ఆసక్తి మేరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్, మట్టితో విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతుండగా.. మండపాల నిర్మాణం, విగ్రహాలు, పూలు, పండ్లు, పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు బిజీబిజీ అయ్యాయి.

- నవరాత్రులకు సర్వం సిద్ధం
- జోరుగా విగ్రహాలు, పూజా సామగ్రి విక్రయాలు
- పూర్తయిన మండపాల నిర్మాణం
- వివిధ వర్గాల వారికి ఉపాధి

నేడు వినాయక చవితి


వినాయక విగ్రహాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: భాద్రపద మాసం శుక్ల చతుర్థి హస్త నక్షత్రం రోజున వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభించడం ఆనవాయితీ. పార్వతీ పరమేశ్వరుల కుమారుడైన వినాయకుడు పుట్టిన రోజునే వినాయక చవితి జరుపుకోనుండగా.. రహదారులు, కూడళ్లు, ఖాళీ ప్లాట్లలో మండపాలను ఏర్పాటు చేసుకుని విగ్రహాలను కొలువుదీర్చారు. జిల్లాలో మొత్తం 4 వేల మండపాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తుండగా, ఖమ్మం నగరంలో వెయ్యికి పైగా మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా.

పూజా విధానం..

వినాయక ఉత్సవాలను ఆగస్టు 27న ప్రారంభించి సెప్టెంబర్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బుధవారం చవితి రోజు ఇంటిని శుభ్రం చేసి, తలంటు స్నానాలు చేసి కొత్త వస్త్రాలు ధరించి మామిడి తోరణాలతో ఇంటిని అలంకరిస్తారు. ఓ పీటకు పసుపు రాసి పళ్లెంలో బియ్యం పోసి వాటిపై తమలపాకులు పెట్టాలి. అగరవత్తులు వెలిగించి దీపారాధన చేసి మంత్రాన్ని ఉచ్చరిస్తూ పూజను ప్రారంభించాలి. పీటపై వినాయక ప్రతిమను ఉంచి, పాలవెల్లికి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి విగ్రహంపై వచ్చేలా వేలాడదీయాలి. దానిపై పత్రివేసి నలుమూలల మొక్కజొన్న పొత్తులు, పళ్లతో అలంకరించాలి. ఉండ్రాళ్లు కుడుములు, పాయసం, గారెలు, పులిహోర, మోదకులు, జిల్లేడుకాయలు పెట్టాలి. రాగి పాత్రలో నీళ్లు పోసి కొబ్బరి కాయ, జాకెట్టు ఉంచి కలశం ఏర్పాటు చేయాలి.

సందడిగా మార్కెట్లు..

ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే వినాయక చవితి రోజున విఘ్నేశ్వరున్ని 21 రకాల ఆకులతో పూజిస్తారు. ఇందులో మాచి పత్రి, గరిక, ఉత్తరేణి, ములక, ఉమ్మెత్త, తులసి, మారేడు, రేగు, మామిడి, గన్నేరు, ధవనం, జమ్మి, శంకు పుష్పం, వావిలి, రావి ఆకులు, దానిమ్మ, జాజిమల్లె, తెల్లమద్ది, దేవదారు పత్రం, గండకీ పత్రం, జిల్లేడు వంటిపత్రాలతో పాటు ఉండ్రాళ్లు, లడ్డూలు, మిఠాయిలు పూజలో వినియోగిస్తారు. ఇవి నగరంలోని పెవిలియన్ గ్రౌండ్, ఇల్లెందు క్రాస్ రోడ్, గాంధీచౌక్, కాల్వొడ్డు, బైపాస్ రోడ్, కమాన్ బజార్, బస్ డిపో రోడ్ తదితర ప్రాంతాల్లో లభిస్తుండగా.. 21 రకాల పత్రులను రూ. 150 నుంచి రూ. 200ల వరకు విక్రయిస్తున్నారు. బంతి పూలు కిలో రూ. 150 నుంచి రూ. 200ల వరకు విక్రయిస్తుండగా.. పూల దండలు సైజును బట్టి రూ. 300 మొదలు వెయ్యి రూపాయలకు పైగానే విక్రయిస్తున్నారు.

విగ్రహాలకు డిమాండ్..

రాజస్తాన్‌కు చెందిన కళాకారులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. జిల్లాలో సుమారు 60 ఖార్ఖానాల్లో, నగరంలో 20 ఖార్ఖానాల్లో విగ్రహాల తయారీ జరుగుతుంది. ఆతర్వాత కలకత్తాకు చెందిన నిపుణులు విగ్రహాలకు వాటర్ కలర్స్ రంగులు దిద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్ది విక్రయిస్తున్నారు. 5 అడుగులు మొదలు 15 అడుగుల ఎత్తు విగ్రహాలను తయారు చేసి రూ.9వేల మొదలు రూ.55వేల వరకు విక్రయిస్తున్నారు. చిన్న విగ్రహాలు కూడా రూ. 2 నుంచి రూ. 3 వేల వరకు ధర పలుకుతుండగా.. మట్టి విగ్రహాలను ఆర్డర్లపై తయారు చేసి సైజును బట్టి రూ. 15 వేల నుంచి రూ. 30 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా విగ్రహాలతో పాటు స్వీట్లు, వివిధ వర్గాలు సౌండ్స్, డెకరేషన్, అయ్యగార్లు, మేళ్లగాళ్లు, పాటలు, డ్యాన్సులు వంటి కళాకారులు, ఆకులు,పూలు అమ్మే తదితర వర్గాల వారు ఉపాధి పొందుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వినాయక ఉత్సవాలకు ప్రభుత్వ అనుమతులను తప్పనిసరి చేశారు. విద్యుత్ సరఫరా, మైక్ వంటి వాటిపై ఇప్పటికే మండప నిర్వాహకులు అనుమతులు పొందారు. లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటలు మొదలు రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని పోలీస్ విభాగం ఆంక్షలు విధించింది. కాగా, ఖమ్మం నగరంలో విద్యుత్ అనుమతులు, చార్జీలను పువ్వాడ ఫౌండేషన్ భరించనుంది.

> 'చేసేది మట్టితో..
> అలంకరించేది ఆకులతో..
> పూజించేది పూలతో..
> నిమజ్జనం చేసేది నీటితో..
> గణపతి అంటే ఆకృతి కాదు.. ప్రకృతి
> మన సనాతన సంస్కృతి'

25 ఏళ్లుగా జీవనోపాధి..



వినాయక విగ్రహాలతోనే ఉపాధి పొందుతున్నాం. కుటుంబం అంతా ఇక్కడే ఉంటూ గత 25 ఏళ్లుగా ఈ కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. విగ్రహాల తయారీకి మెటీరియల్ ఖర్చులు పెరిగాయి. తయారీలో పోటీ కూడా పెరిగింది.

– సుఖ్‌దేవ్, విగ్రహాల తయారీదారుడు, రాజస్థాన్

రూ. 10 వేలతో విగ్రహాన్ని కొన్నాం..



పదేళ్లుగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. వినాయక విగ్రహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సైజు, ఆకర్షణను బట్టి ధరలు ఉన్నాయి. ఈసారి రూ. 10 వేల ధర కలిగిన పీఓపీ విగ్రహాన్ని కొనుగోలు చేశాం.

– నిఖిల్, గాంధీచౌక్, ఖమ్మం

మట్టి వినాయక విగ్రహాలే మేలు..

వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం వినాయక విగ్రహాలను పలు విద్యాలయాలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన ఉచితంగా అందించారు. పర్యావరణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించుకోవాలని పలువురు సూచించారు. ఈమేరకు మండపాలను సుందరంగా తీర్చిదిద్దారు.

– సాక్షినెట్‌వర్క్


ఖమ్మం రాపర్తినగర్: పెవిలియన్‌గ్రౌండ్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న వాకర్లు


ఖమ్మంగాంధీచౌక్: శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో.. మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి


ఖమ్మంఅర్బన్: బాలగణపతి ఆలయంలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న దేవాదాయ శాఖ బాధ్యులు


ఖమ్మంమయూరిసెంటర్: 23వ డివిజన్‌లో మట్టి విగ్రహాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ మక్బూల్


ఖమ్మంమయూరిసెంటర్: 25వ డివిజన్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ

వినాయకుడి సాక్షిగా..

ఖమ్మం అర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్‌ఆర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో లబ్ధిదారులకు వినాయకుడి సాక్షిగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్ మంగళవారం అందజేశారు. అలాగే 2వ డివిజన్‌లో కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు పాండురంగాపురంలో ఇందిరమ్మ పట్టాలు అందించారు.


పత్రాలు అందుకున్న వారితో కార్పొరేటర్ సైదులు

నగరాభివృద్ధికి పారిశుద్ధ్య నిర్వహణ కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా నిర్వహించడం ద్వారానే ఇండోర్ నగరం గత కొన్నేళ్లుగా స్వచ్ఛ భారత్‌లో మొదటి స్థానంలో నిలుస్తుందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. మంగళవారం కేఎంసీలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏ నగరం అభివృద్ధి చెందాలన్నా పారిశుద్ధ్య నిర్వహణే కీలకమన్నారు. ఇండోర్‌లో ఏ చిన్న పేపర్ ముక్క రోడ్డుపై పడేసినా రూ.వేల జరిమాన విధిస్తున్నారని, చెత్త సేకరణ అంతా కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేస్తున్నారని, ఇంటి నుండే చెత్త సెగ్రిగేషన్ చేసి సేకరణ వాహనాలకు అందజేస్తున్నారని తెలిపారు. మంత్రి తుమ్మల సూచనలతో కేఎంసీ బృందం ఇండోర్ వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించామని, అభివృద్ధిని తాను చూసుకుంటానని, పారిశుద్ధ్య నిర్వహణపై కార్పొరేషన్ పాలకవర్గం దృష్టిసారించాలని సూచించారు. సుందరీకరణలో, పచ్చదనంలో ఇండోర్‌తో పోలిస్తే ఖమ్మం నగరం అద్భుతంగా ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మలీదు వెంకటేశ్వరరావు, ఏఎంసీ అనిల్‌కుమార్, ఆర్ఓ యాకూబ్‌పాషా, వార్డు ఆఫీసర్లు హసీష, శ్రీలేక తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

నేలకొండపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ కోరారు. మండలంలోని చెరువుమాధారంలో పారిశుద్ధ్య నిర్వహణను మంగళవారం పరిశీలించాక జీపీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టడంతో పాటు గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు గెల్లా నాగసాయి, మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, కొండా హర్షవర్ధన్, అల్లి భూలక్ష్మి, పురాణం దివాకర్, కళ్యాణం నాగేశ్వరరావు, కందర బోయిన వెంకటరమణ, లక్ష్మీనారాయణ, బానోత్ శ్రీను, గెల్లా మధు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన పిచ్చి చెట్లు..

నేలకొండపల్లి: పిచ్చి చెట్లతో రహదారి కనిపించకుండా ప్రమాదాలకు నిలయంగా మారిందని జంగిల్ క్లియరెన్స్ చేపించండి లేదా రోడ్డు అయినా మూసేయండని పలువురు డిమాండ్ చేశారు. మండలంలోని రాయగూడెం–చెరువుమాధారం గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగి రహదారి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రాయగూడెం, కొంగర, కట్టుకాచారాం, అప్పలనరసింహాపురం గ్రామాల ప్రజలు మంగళవారం రహదారి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, బోయిన బలరాం, తీగ రమణయ్య, బోయిన వేణు, ప్రధానపు నాగయ్య, తీగ వెంకటేష్, శీలం వెంకటనర్సయ్య, ప్రసాద్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు గర్హనీయం

ఖమ్మం లీగల్: జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి వ్యతిరేకంగా హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని తెలుగుదేశం రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గొల్లపూడి రామారావు ఒక ప్రకటనలో అన్నారు. తెలుగు జాతి వారు ఉపరాష్ట్రపతిగా పోటీ చేయడం అమిత్ షా జీర్ణించుకోలేక బీజేపీ అభ్యర్థి ఓటమి ఖాయమని భావించి ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో డిప్యూటేషన్‌పై తొమ్మిది నెలల పాటు సేవలు అందించి సుబ్లేడుకు వెళ్తున్న హిందీ ఉపాధ్యాయుడు మహ్మద్ రియాజుద్దీన్‌కి పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్.బాబుతో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులు

ఖమ్మం అర్బన్/ఖమ్మంసహకారనగర్: నగరంలోని బొమ్మ , ఎస్‌బీఐటీ కళాశాలల్లో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మ కళాశాలలో ఖమ్మం అర్బన్ ఎస్‌ఐలు శ్రావణ్‌కుమార్, భీమా, ఎస్‌బీఐటీలో ఖానాపురం హవేలీ సబ్ ఇన్‌స్పెక్టర్ గౌతమిలు పాల్గొని విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే సమస్యలు, తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా కళాశాలల బాధ్యులు అమ్మరాజీనగరరావు, జి.ధాత్రి, గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నేలకొండపల్లి: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రపుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తకొత్తూరులో మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి స్మృతిగా వంద ఎకరాల్లో వనం ఏర్పాటు చేయాలని, ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు 250 గజాల స్థలం, ఇళ్లు మంజూరు చేసి పెన్షన్, ఆరోగ్య కార్డులు, బస్ పాసులు అందించాలని కోరారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ తుల్జారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు, నాయకులు బి.మోహన్, తీగ రాములు, వడ్డె జగన్, కృష్ణమూర్తి, వి.బాబు తదితరులు పాల్గొన్నారు.

48 ఇళ్లు.. 200 దరఖాస్తులు

- డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- క్షేత్రస్థాయిలో ఇంటింటి విచారణ


వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ అల్లం రవి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండల కేంద్రంలోని సింగారెడ్డిపాలెంలో 2017 డిసెంబర్‌లో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి వదిలేశారు. ఈనేపథ్యాన తాజా ప్రభుత్వం వాటిని పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించింది. మొత్తం 48 ఇళ్లకు గాను.. 200 దరఖాస్తులు అందాయి.

ఇంటింటి సర్వే..

డబుల్ బెడ్రూం ఇళ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు రెవెన్యూ అధికారులు ఇంటింటి విచారణ చేపట్టారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం ఏ ఇంట్లో ఉంటున్నారు.. పూరి గుడిసెనా లేక అద్దెకు ఉండే ఇల్లా.. రేషన్ కార్డు ఉందా లేదా.. వితంతు ఎవరైనా ఉన్నారా.. ఉంటే వారిలో ఎవరైనా ఎయిడ్స్ పేషెంట్ ఉన్నారా.. తదితర వివరాలను క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నారు. అనంతరం స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు జాబితాను ఆమోదం చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా అర్హత కలిగిన తమకు ఇళ్లను ఇవ్వాలని పలువురు బాధితులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై పునరాలోచన చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాంనారాయణ

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నందున ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఐజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ కోరారు. ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నివాస స్థలాలపై పాలకులు సరైన రీతిలో స్పందించకపోగా, పంపిణీకి అవకాశం ఉన్న చోట కూడా మోకాలడ్డుతున్నారన్నారని తెలిపారు. ఈ నేపథ్యాన నివాస స్థలాల సాధన, జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత, కనీస వేతన అమలుకు ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగర అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాసరావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు నలజాల వెంకట్రావు, రాష్ట్ర నాయకులు ఎం.వేణుగోపాలరావు, సామినేని మురారి, నర్వనేని వెంకట్రావు, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులుతో పాటు మామిడాల భూపాల్‌రావు, మహేందర్, వనం వెంకటేశ్వర్లు, జనతా శివానంద, జనార్ధనాచారి, ఏలూరి వేణుగోపాలరావు, నామా పురుషోత్తం, శ్రీనివాసరావు, కళ్యాణ్‌చక్రవర్తి, పుసులూరి సత్యనారాయణ, అప్పారావు, శ్రీనివాస్, రజినీకుమార్‌రెడ్డి, మేడి రమేష్, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు

➽ పెద్దాస్పత్రి సమస్యలపై సూపరింటెండెంట్‌కు వినతి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో పాటు సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. పెద్దాస్పత్రికి పేషంట్లు అధికసంఖ్యలో వస్తున్నారని, వారికి అనుగుణంగా డాక్టర్లను నియమించాలని, బెడ్లు పెంచాలని, పర్మినెంట్ హార్ట్ డాక్టర్‌ను నియమించాలని, సీటీ స్కాన్, ఈసీజీ, నెఫ్రాలజీ, యూరాలజీ తదితర టెస్టులు పూర్తిగా చేయాలన్నారు. లేనిపక్షంలో ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు టి.విష్ణు, బోడపట్ల సుదర్శన్, నాగులుమీరా, చిన్న హుస్సేన్, సుభాష్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

➽ ప్రజా సమస్యలపై తహసీల్దార్, ఎంపీడీఓలకు

కూసుమంచి: ప్రజా సమస్యలను విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం పార్టీ ఆధ్వర్యాన తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాంచందర్‌రావులకు వినతిపత్రాలు అందజేశారు.కూసుమంచి గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, గ్రామ కార్యదర్శి వెంగళరావు, నాయకులు రమణారెడ్డి, గంగాధర్, కర్ణబాబు, గన్యానాయక్, రాధాకృష్ణ, వెంకటయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➽ కమీషన్ విడుదల చేయాలని..

ఖమ్మం అర్బన్: ఐదు నెలలుగా కమీషన్ విడుదల చేయకపోవడంతో ఖమ్మం అర్బన్ డీలర్లు మంగళవారం ఖమ్మం జిల్లా రేషన్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వాకదాని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వై.ఉమారాణి మాట్లాడుతూ.. కమీషన్ విడుదల చేయడంతో పాటు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతీ డీలర్‌కు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాకు రూ.300 కమీషన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. హమాలీ ఖర్చులు భరించడంతో పాటు డీలర్లను రెన్యువల్ లేకుండా కొనసాగించాలని, జిల్లా కేంద్రంలో రేషన్ డీలర్స్ యూనియన్ ఆఫీస్ నిర్మాణానికి 500 గజాల స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆతర్వాత కలెక్టరేట్‌లోనూ వినతిపత్రం సమర్పించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు మోటమర్రి చంద్రశేఖరరావు, గోళ్ల మురళీ, షరాబు మహేశ్, యక్కల సుధాకర్‌రావు, సంతోష్‌కుమార్, శేఖరబాబు, వీరభద్రయ్య, రాధాకృష్ణ, సత్తార్మియా, కె.లక్ష్మయ్య, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.